www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 10 జనవరి 2024
5
ఏలూరు





రానున్న ఎన్నికల సన్నద్ధత, ఓటర్ల జాబితాపై మంగళవారం విజయవాడలోని నోవాటెల్ హోటల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి హాజరయ్యారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం



ర్యాలీ అగ్రభాగాన నేతలు

వ్యవసాయానికి సాగునీటి వనరులు పెరగాలి

భూపంపిణీతోనే అసమానతల్లేని అభివృద్ధి సాధ్యం

జిల్లా సమగ్రాభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి ఏదీ

సిపిఎం ఆధ్వర్యాన సదస్సులో వక్తలు

ఆకట్టుకున్న రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు, ప్రదర్శన



రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు



మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు



ఎంఎల్‌సి ఐవి



ఎ.రవి.



తెల్లం రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లా సమగ్రాభివృద్ధిపై పాలకులకు చిత్తశుద్ధి లేదని, జిల్లాలో అనేక వనరులు ఉన్నప్పటికీ అభివృద్ధి లేకుండాపోయిందని, సామాన్య ప్రజానీకం అభివృద్ధి చెందడమే నిజమైన అభివృద్ధి అని ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధి సదస్సులో వక్తలు పేర్కొన్నారు. ఏలూరులో నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా మంగళవారం స్థానిక కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపంలో సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధిపై సదస్సు నిర్వహించారు. తొలుత స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రి మెయిన్ గేట్ నుండి ఆర్ఆర్‌పేట మీదుగా కాశీవిశ్వేశ్వర కళ్యాణ మండపం వరకు సిపిఎం నిర్వహించిన రెడ్‌షర్ట్ వాలంటీర్ల కవాతు, ప్రజాప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. జిల్లా సమగ్రాభివృద్ధికి చర్యలు చేపట్టాలంటూ సిపిఎం కార్యకర్తలు పెద్దఎత్తున నినాదాలు చేశారు. కళాకారుల డప్పుల నృత్యం, పాటలు ఆకట్టుకున్నాయి. ఎర్రజెండాలు చేతబూని వాలంటీర్లు చేసిన కవాతు ప్రత్యేకంగా ఆకర్షించింది. అనంతరం జరిగిన సదస్సులో వేదికపైకి వక్తలను, ఆహ్వానితులను సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్ ఆహ్వానించగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి సదస్సుకు అధ్యక్షత వహించి అధ్యక్షోపన్యాసం చేశారు. ఏలూరు జిల్లా సమగ్రాభివృద్ధిపై మేధావులు, నిపుణులతో చర్చలు జరిపి నివేదిక తయారు చేసి దాని ఆధారంగా ఉద్యమాలు సాగిస్తామన్నారు. అభివృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలేవీ జిల్లా అభివృద్ధిపై మాట్లాడటం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో అభివృద్ధినే ప్రజాఎజెండాగా చర్చ జరగాలన్నారు. జిల్లాలో గోదావరి, కృష్ణా నీరు ప్రవహిస్తుందన్నారు. ఏరులు ఉన్నాయని, అటవీ సంపద, సుద్ద, బొగ్గు, ఐరన్ ఓరు వంటి గనులు ఉన్నాయన్నారు. శ్రమజీవుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. చింతలపూడి, తాడిపూడి వంటి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేస్తే నీటివనరులు పెరిగి వ్యవసాయం అభివృద్ధి చెందుతుందన్నారు. ఏజెన్సీలో చట్టాలు అమలు కావడం లేదన్నారు. జిల్లాలో పాపికొండలు, గుంటుపల్లి బౌద్ధారామాలు, కొల్లేరు వంటి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయన్నారు. మెడికల్ కాలేజీ వచ్చినా సరైన వైద్యసదుపాయాలు అందుబాటులో లేవన్నారు. ఏలూరు నగరంలో డ్రెయినేజీ, టిడ్కో ఇళ్లు వంటి తీవ్ర సమస్యలు ఉన్నాయని తెలిపారు. కొల్లేరు కాంటూరు ఐదు నుండి మూడుకు కుదించాలని డిమాండ్ చేశారు. ఎకో సెన్సిటివ్ జోన్ ప్రతిపాదనను విరమించుకోవాలని కోరారు. ముఖ్యఅతిథి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాల విభజన అనంతరం ఏర్పడిన ఏలూరు జిల్లా మెట్ట, ఏజెన్సీ ప్రాంతాలతో రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల మాదిరిగా వెనుకబడిన జిల్లాగా అభివృద్ధికి దూరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో పేదలకు పంచేందుకు 16 రకాల ప్రభుత్వ భూములు మూడు లక్షల ఎకరాలకుపైగా ఉన్నాయని చెప్పారు. జిల్లాలో ఆరు లక్షల మంది భూమి లేని వ్యవసాయ కార్మికులకు భూపంపిణీ జరిగితేనే జిల్లాలో నిజమైన అభివృద్ధి జరుగుతుందన్నారు. భూయాజమాన్య హక్కు చట్టం వల్ల రైతులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టు నిర్మాణం పట్ల ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు పట్టించుకోకుండా గాలికొదిలేశారని విమర్శించారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి పిడిఎఫ్ మద్దతు

ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు

ఏలూరు జిల్లాలో అన్ని వనరులూ ఉన్నాయని, జిల్లా సమగ్రాభివృద్ధిని పిడిఎఫ్ బలపరుస్తుందని, అభివృద్ధిపై తయారు చేసిన నివేదికను ప్రభుత్వం పట్టించుకోవాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు అన్నారు. డిఆర్‌సి, జిల్లా పరిషత్ సమావేశాలు, పాలన మండళ్లలోనూ దీనిపై మాట్లాడతామన్నారు. రాష్ట్రమంతా ప్రజాఉద్యమాలు జరుగుతున్నా సిఎంకు తెలియదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల తర్వాత జీతాలు పెంచుతానని చెప్పడం చాలా విడ్డూరంగా ఉందన్నారు. ఉపాధ్యాయులకు రూ.18.96 వేల కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. 11 డిఎల్లో ఒకటి కూడా ఇవ్వలేదన్నారు. నాలుగున్నరేళ్లలో డిఎస్‌సి వేయలేదన్నారు. 15 వేల స్కూళ్లు ఒకే ఒక టీచర్‌తో నడుస్తున్నాయని తెలిపారు. ఇంటర్, డిగ్రీ కాలేజీలు ఎన్ని ప్రారంభించారని ప్రశ్నించారు. ఎయిడెడ్ కాలేజీలు మూసేశారన్నారు. జిల్లాలో ఆధునీకరణ పనులు ఒక్కటి చేయలేదని తెలిపారు. కొల్లేరువాసులకు కార్డులు ఇవ్వడం లేదన్నారు. శాసనసభ, మండలిలో ప్రశ్నోత్తరాలు కుదించేశారు, చర్చా వేదికలు లేవన్నారు. ప్రజాపోరాటాలే చర్చా వేదికలుగా మారాలన్నారు.

సాగునీటి వనరుల అభివృద్ధి జరగడం లేదు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

జిల్లాలో సాగునీటి వనరుల అభివృద్ధి అత్యవసరమని, చింతలపూడి, తాడిపూడి వంటి ఎత్తిపోతల పథకాలు పూర్తి చేయకపోతే అభివృద్ధి ఏవిధంగా జరుగుతుందని ప్రశ్నించారు. కొయ్యలగూడెం, లింగపాలెం వంటి మండలాల్లో భూగర్భజలాలు భారీగా తగ్గిపోయాయన్నారు. ఆయిల్‌పామ్, కొబ్బరి, కోకో, మామిడి, జీడిమామిడి, నిమ్మ, ఉద్యాన పంటల విస్తీర్ణం అధికంగా ఉందని చెప్పారు. ప్రభుత్వ సహకార రంగంలో వ్యవసాయాధారిత పరిశ్రమలు ఏర్పాటుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. తద్వారా రైతులకు కనీస మద్దతు ధరలు, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అంగట్లో అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు సహజ వనరులు విస్తారంగా ఉన్నా వాటిని వినియోగించి పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడంలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. జిల్లాలో అనేక రకాల పంటలు, గనులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు జిల్లా అభివృద్ధికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ ఏజెన్సీలో గిరిజనుల సమస్యలను వివరించారు. ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ వందన సమర్పణ చేస్తూ నగరంలోని పలు సమస్యలు, అభివృద్ధికి అవకాశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు బి.సోమయ్య, గుడిపాటి నరసింహారావు, పి.రామకృష్ణ, తామా ముత్యాలమ్మ, పి.మంగరాజు, ఎం.జీవరత్నం, తెల్లం దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.



ఏలూరులో ర్యాలీ చేపడుతున్న అంగన్వాడీలు

అంగన్వాడీల సమ్మె ఉధృతం

ఏలూరులో జైల్‌భరో - భారీ ప్రదర్శన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

29 రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తున్న అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సమ్మె 29వ రోజు మంగళవారం జిల్లాకేంద్రమైన ఏలూరులో కదంతొక్కారు. రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జైల్‌భరో కార్యక్రమంలో భాగంగా స్థానిక కలెక్టరేట్ నుండి భారీ ప్రదర్శన చేపట్టారు. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో బైఠాయించారు. వీరికి వివిధ కార్మిక, ప్రజా సంఘాలు, రాజకీయపక్షాలు మద్దతుగా నిలిచాయి. రెండుగంటలకు పైగా ఆందోళన చేపట్టారు. దీంతో ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ట్రాఫిక్ స్తంభించింది. టిడిపి ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి బడేటి రాధాకృష్ణ(చంటి), జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎం.కృష్ణచైతన్య, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు రాజనాల రామ్మోహన్‌రావు, చోడే వెంకటరత్నం తదితరులు మద్దతు ప్రకటించి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభకు అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పి.భారతి అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డిఎన్‌విడి.ప్రసాద్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అంగన్వాడీల సమస్యను జఠిలం చేస్తున్నదని విమర్శించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డితో బెదిరింపు ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. వేతనాలు పెంచే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉభయగోదావరి జిల్లాల ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీల పోరాటం రాష్ట్ర ఉద్యమాల చరిత్రలోనే రికార్డు సృష్టించబోతోందన్నారు. వైసిపి ప్రభుత్వం కార్మిక, మహిళా వ్యతిరేక ప్రభుత్వంగా నిరూపించుకుంటుందన్నారు. ఎస్మా చట్టం అంగన్వాడీలను ఏమీ చేయలేదని మనోధైర్యం నింపారు. తక్షణం వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే ఈ ప్రభుత్వం ఇంటికి వెళ్లడం ఖాయమని హెచ్చరించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడాలని పిడిఎఫ్ ఎంఎల్‌సిలుగా తామంతా సంపూర్ణ మద్దతిస్తున్నామని, చివర వరకూ తోడుగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.ధనలక్ష్మి, మధ్యాహ్న భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేడియం నాగమణి, ఐద్వా సంఘం జిల్లా కార్యదర్శి సుభాషిణి, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎర్ర రాంబాబు, వి.సాయిబాబు, కె.విజయలక్ష్మి, బి.భవాని, పుష్ప, రమాదేవి, తులసి పాల్గొన్నారు.

అంగన్వాడీకి అస్వస్థత

స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్‌లో బైఠాయించి నిరసన తెలియజేస్తున్న సమయంలో ఏలూరు సత్యన్నారాయణ కాలనీకి చెందిన అంగన్వాడీ కార్యకర్త బేబీ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వెంటనే తోటి కార్యకర్తలు ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

కొనసాగిన ఎస్ఎస్ఎ ఉద్యోగుల సమ్మె

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె మంగళవారానికి 21వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా స్థానిక కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు నిరసన కార్యక్రమం కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ తమను రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జెఎసి నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలో కీలకపాత్రపోషిస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని సిఎం జగన్ పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి అమలు చేయకుండా, నెలల తరబడి వేతనాలు విడుదల చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్యాయంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం పనికి తగ్గ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆపేదిలేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష జెఎసి నాయకులు వినోద్, ఝాన్సీ, భగవాన్, రాజు, రాధిక, కేశవరావు, సత్య, సందీప్, దిలీప్ పాల్గొన్నారు.

ఉద్యమాల అణిచివేత అవివేకం : యుటిఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు

నిర్బంధాలు, అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపాలనుకోవడం అవివేకమని యుటిఎఫ్ విమర్శించింది. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడలో చేపట్టనున్న 36 గంటల ధర్నాను అడ్డుకునేందుకు జిల్లాలోని పోలీసులు నిర్బంధకాండను ప్రయోగించారు. యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావును సోమవారం రాత్రి నుంచి గృహ నిర్బంధంలో ఉంచడమే కాకుండా మంగళవారం ఉదయం ఆరు గంటల నుంచి రాత్రి వరకూ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. దీనిపై యుటిఎఫ్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'గృహనిర్బంధాలు, అక్రమ అరెస్టులతో నిరసనలు ఆపగలరేమో కానీ మాకు వాస్తవంగా రావాల్సిన ఆర్థిక బకాయిలన్నీ చెల్లించాల్సిన బాధ్యత ఈ ప్రభుత్వం మీద లేదా? అధికారంలోకి వస్తే ప్రతినెలా ఒకటో తేదీన జీతం, మెరుగైన పిఆర్‌సి, సకాలంలో డిఎలు, ఉద్యోగ ఉపాధ్యాయులతో స్నేహపూరిత వాతావరణం అని ముఖ్యమంత్రి చెప్పిన మాట వాస్తవం కాదా? బకాయిలు చెల్లించమని అడుగుతుంటే అదిగో తోక అంటే ఇదిగో పులి అన్న చందాన వ్యవహరిస్తున్నారు. ఒకపక్క సాక్షాత్తు ముఖ్యమంత్రి గారు మా ఆర్థిక పరిస్థితి మెరుగైంది అని చెబుతుంటే అధికారులు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతున్నారు.. ఎవరి మాటలు విశ్వసించాలి?' అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో పిఆర్‌సి బకాయిలతో పాటు అన్నిరకాల ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. 36 గంటల నిరసన కార్యక్రమానికి విజయవాడ ధర్నా చౌక్ కేంద్రంగా పిలుపునిస్తే అనుమతులిచ్చినట్టే ఇచ్చి కార్యక్రమం దగ్గరకు వచ్చాక ఇలా నిర్బంధాలకు పాల్పడటం దారుణమన్నారు.

కోడి పందేల బరులు ధ్వంసం

ప్రజాశక్తి వార్తకు స్పందన



బరిని ధ్వంసం చేస్తున్న పోలీసులు

జీలుగుమిల్లి: సంక్రాంతి సందర్భంగా మండలంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన కోడిపందేల బరులు పోలీసులు ధ్వంసం చేశారు. దీనిపై ప్రజాశక్తిలో మంగళవారం ప్రచురితమైన 'కోడి పందేల బరులు సిద్ధం' వార్తకు పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించారు. మండలంలోని ఆయా బరులవద్దకు వెళ్లి ధ్వంసం చేశారు. మండలవ్యాప్తంగా తనిఖీలు కూడా చేపట్టారు. అనంతరం రెవెన్యూ, సచివాలయ సిబ్బంది ఆయా పంచాయితీల్లో క్షేత్రస్థాయిలో వెళ్లి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి కోడి పందేలు, జూదం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.



ఏలూరులో ఎర్ర తోరణాలతో అలంకరణ

నేటి నుండి ఏలూరులో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు

పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబీ రాక

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 10, 11 తేదీలు బుధ, గురువారాల్లో సిపిఎం రాష్ట్ర కమిటీ సమావేశాలు ఏలూరులో జరగనున్నాయి. ఈ సమావేశాలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి కోరారు. ఈ సమావేశాలకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు, ఎంఎ.బేబీ ఏలూరు వస్తున్నారని తెలిపారు. సమావేశాలు ఏలూరు మున్సిపల్ కార్యాలయ సమీపంలోని శ్రీ హోటల్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలు, ప్రజా సమస్యలు, ఎన్నికల కర్తవ్యాలను ఈ సమావేశాల్లో చర్చిస్తారని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు ఈ సమావేశాల్లో పాల్గొంటారని తెలిపారు. సమావేశాల సందర్భంగా నగరంలో పలుచోట్ల ఎర్రజెండాలతో అలంకరణ చేశారు.

కోడి పందేలు, జూద క్రీడలు నిషేధం

పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

హైకోర్టు ఉత్తర్వులు కచ్చితంగా పాటించాలి

కంట్రోల్‌రూమ్‌ల ఏర్పాటు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు: జిల్లాలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. ఎపి, తెలంగాణ ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు-2016లో జారీ చేసిన ఉత్తర్వుల మేరకు కోడిపందేలు, బెట్టింగులు నిర్వహణ, ప్రోత్సహించడం, పాల్గొనడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సదరు ఉత్తర్వులను అతిక్రమించినచో సంబంధిత చట్టాల ప్రకారం శిక్షార్హులని హెచ్చరించారు. జిల్లాలో ఎవరైనా ఈ ఉత్తర్వులను అతిక్రమిస్తే సదరు సమాచారాన్ని జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం.08812-224519, సదరు విషయంపై తీసిన ఫొటోలు, వీడియోలను వాట్సాప్ నెం.9491041428కు పంపించాలని కోరారు. అదేవిధంగా ఏలూరు జిల్లా ఎస్‌పి, జిల్లాలోని ఆర్‌డిఒ కార్యాలయాల్లో కూడా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎస్‌పి కార్యాలయం సెల్ నెంబర్ 9550351100, ఏలూరు ఆర్‌డిఒ కార్యాలయం 08812-232044, నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం, 08656-232717, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ కార్యాలయం సెల్ నెంబర్ 8500668001కు సమాచారం అందించవచ్చని పేర్కొన్నారు.



పంగనామాలతో నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

పంగనామాలతో మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మున్సిపల్ కార్మికులకు సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కార్మికులకు పంగనామాలు పెడుతున్నారంటూ రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం మున్సిపల్ కార్మికులు 15వ రోజు మంగళవారం పంగనామాలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి యూనియన్ అధ్యక్షులు లావేటి కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు మాట్లాడుతూ సిఎం జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కార్మికులకు పంగనామాలు పెట్టిందని, పర్మినెంట్, సమాన పనికి సమాన వేతనం అమలు చేయకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి బంగారు వెంకటేశ్వరరావు, పంతం నాగరాజు, జార్జి, గోపి, అర్లప్ప, దుర్గ, నాగమణి, రమణమ్మ, కాంతమ్మ, సునీత, రాజు, బండి రాజు, హనుమంతరావు, రామారావు, కొండలరావు, రాజేష్ తదితరులు నాయకత్వం వహించారు.

నూజివీడు: మున్సిపల్ కార్మికుల సమ్మె 15వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా వారు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం ఎదుట మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్.హనుమాన్లు, జి.రాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు జయలక్ష్మి, గోవిందు, రజని, ఉషారాణి, పద్మ, రాణి, భారతి, భవానీ, జయరాం, చంద్రశేఖర్, రాజేంద్ర, పృథ్వీ, ఏడుకొండలు, గాంధీ, చిన్నారి, గంగాధర్, రమాదేవి పాల్గొన్నారు.

చింతలపూడి : మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌విఎస్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో నగర పంచాయతీ వద్ద సిఐటియు అధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె 14వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లడూతూ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, పద్మ, కమలమ్మ పాల్గొన్నారు.

ఎఐటియుసి ఆధ్వర్యాన చేపట్టిన సమ్మెలో భాగంగా మున్సిపల్ కార్మికులు భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తొర్లపాటి బాబు మాట్లాడారు.

ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామస్వరాజ్యం : డిపిఒ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజల భాగస్వామ్యంతో గ్రామ పంచాయతీల పరిపాలన సాగితే నిజమైన గ్రామ స్వరాజ్యం సాధించొచ్చని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ అన్నారు. గ్రామ పంచాయతీ పరిపాలనలో పారదర్శకతకు ప్రజా భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి ప్రణాళికలు జరపాలన్న ప్రభుత్వ ఉద్దేశం ఈ శిక్షణ తరగతుల ద్వారా సిబ్బంది నెరవేర్చాలని డిపిఒ అన్నారు. పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి కమిషనర్ సూర్యకుమారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశాలు మేరకు విస్తరణ అధికారులకు, ఎంపిడిఒలకు, పంచాయతీ కార్యదర్శులకు, మండలస్థాయి కో ఆర్డినేటర్లకు రెండు రోజుల శిక్షణా తరగతులను జెడ్‌పి సిఇఒ వెంకట సుబ్బారావు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయి అధికారులు పాల్గొని శాఖలవారీగా అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయరాజు మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి ప్రణాళికల తయారీలో మహిళా భాగస్వామ్యం ఉండాలన్నారు. పీడీ గ్రామీణ నీటి యాజమాన్య సంస్థ రాము మాట్లాడుతూ ఉపాధి చట్టం సమర్థవంతంగా గ్రామస్థాయిలో జరగాలంటే ముందస్తు ప్రణాళికలు అవసరమన్నారు. శిక్షణా తరగతుల్లో, నగదు రహిత కార్యక్రమాలు, ప్రజాప్రణాళిక ఉద్యమం లక్ష్యాలు, ప్రణాళికల తయారిలో అధికారుల పాత్ర, గ్రామ పంచాయతీ ఫంక్షనల్ కమిటీల ఏర్పాటు, జిపిడిపి అమలు నివేదిక, బాల సభ, మహిళా సభ నిర్వహణ, ఇ-గ్రామస్వరాజ్ తదితర అంశాలపై సిబ్బందికి శిక్షణ తరగతుల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ మేనేజర్ ప్రత్సంగి రాజు, డిఎల్‌పిఒలు చంద్రశేఖర్, రాజాఉల్లాహ్, సుందరి, డిపిఎం పులి వెంకటసత్యనారాయణ పాల్గొన్నారు.

మోకాళ్లపై నిల్చొని అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలో అంగన్వాడీల సమ్మె 29వ రోజూ కొనసాగింది. ఈ సందర్భంగా మోకాళ్లపై నిలబడి అనంతరం గుంజీలు తీసి వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీలు మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్మాతో ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు పాల్పడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీల యూనియన్ నాయకులు శివరత్నకుమారి, పి.పద్మజ, జె.నాగవేణి, అడపా నాగజ్యోతి, సిహెచ్.సునీతారాయల్, బొబ్బిలి చిట్టి, కె.జ్యోతి, కె.మాధవి, పి.భాగ్యలక్ష్మి, ఎం.వెంకటలక్ష్మి, ఎం.మంగ పాల్గొన్నారు.



కొయ్యలగూడెంలో గుంజీలు తీస్తూ నిరసన

నిడమర్రు : అంగన్వాడీలపై ప్రయోగించిన ఎస్మాను రద్దు చేయాలని మండలంలోని అంగన్వాడీలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. అంగన్వాడీల సమ్మె 29వ రోజుకు చేరిన సందర్భంగా ప్రధాన రహదారిపై మోకాళ్లపై నిలబడి, సూర్య నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.జయమ్మ, పార్వతి, సుభాషిణి, కెవి.సత్యవతి, వరలక్ష్మి, వెంకటలక్ష్మి, అనురాధ, కుమారి, అరుణ పాల్గొన్నారు.



చాట్రాయిలో..

నూజివీడు : అంగన్వాడీల సమ్మె 29వ రోజు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ఆర్ హనుమాన్లు, జి.రాజు, అంగన్వాడీ యూనియన్ నాయకులు ఆదిలక్ష్మి, మని, వసుంధర, విజయలక్ష్మి, శిరీష, స్వర్ణ, పద్మ, శ్యామల, గ్లోరీ, జాన్సీ, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : అంగన్వాడీల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చేపట్టిన నిరవధిక సమ్మె నిరంతరాయంగా కొనసాగుతూ మంగళవారానికి 29వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్వాడీలు వారి సమస్యల కరపత్రాలను నెత్తి మీద ప్లేట్‌లలో పెట్టుకొని బిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, నాగమణి, హైమవతి, పుష్ప, జ్యోతి, బేబీ, అరుణ పాల్గొన్నారు.

మండవల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని షరతులు విధించినా ఎంత ఒత్తిడి తెచ్చిన ఆందోళన విరమించబోమని అంగన్వాడీలు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న ఆందోళన మంగళవారం కొనసాగింది. 29వ రోజు అంగన్వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ లీడర్లు చెల్లమ్మ, వాణి, విజయలక్ష్మి, ఉమాదేవి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

చాట్రాయి : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తమ న్యాయమైన డిమాండ్ల సాధనలో భాగంగా 29 రోజులుగా సమ్మె చేస్తున్నారు. మంగళవారం మండల కార్యాలయ వద్ద సమ్మె శిబిరంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ అధికారుల బెదిరింపులకు లొంగవద్దని, మిమ్మల్ని ఉద్యోగం నుంచి తీసివేసే హక్కు ఎవరికీ లేదన్నారు. అనంతరం నూజివీడు డివిజన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని సిఐటియు నాయకులు రాజకుమారి, ఆదిలక్ష్మి, కనకదుర్గ అంగన్వాడీ కార్యకర్తలకు, హెల్పర్లకు మద్దతు తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు 29వ రోజు అంకెల రూపంలో ఉండి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి విజయ, పద్మ, సుధా, జయశ్రీ, కుసుమ కుమారి నాయకత్వం వహించారు.

టి.నరసాపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మె 29వ రోజు మంగళవారం కొనసాగింది. టెంట్‌లో కూర్చుని అంగన్వాడీ కార్యకర్తలు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదన్నారు.

కలిదిండి : స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట 29 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా మంగళవారం అంగన్వాడీలు ఏలూరు కలక్టరేట్‌కు తరలివెళ్లారు. షేక్ అబిదా బేగం, పి.విజయ లక్ష్మి, ఇ.సరస్వతి, యు.గీత కుమారి, జె.పెద్దింట్లమ్మ, అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ 24 గంటల రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు.

కైకలూరు : కైకలూరులో 29వ రోజు సమ్మెలో భాగంగా అంగన్వాడీలు 29 అంకె రూపంలో కూర్చుని నిరసన తెలిపారు.

ముసునూరు : మండలంలోని ముసునూరు గ్రామ సచివాలయంలో అంగన్‌వాడీలు 29వ రోజున 29వ అంకె రూపంలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నూజివీడు నియోజకవర్గ ప్రాజెక్టు కార్యదర్శి పల్లిపాము రాజకుమారి, కలపాల విద్యావతి, మేరి సులోచన, లక్ష్మి, శిరిష, వెంకటేశ్వరమ్మ, ఆలివేలు, మంగ, సుజాత, మార్తమ్మ, దుర్గ పాల్గొన్నారు.



మండవల్లిలో..

చింతలపూడి : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీల సమ్మె 29వ రోజుకు చేరింది. మంగళవారం అంగన్వాడీల సమ్మెకు చింతలపూడి బార్ అసోషియేషన్ న్యాయవాదులు, టిడిపి, జనసేన, కాంగ్రెస్‌లు పూర్తి మద్దతు తెలియజేశారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించి వారు చేస్తున్న సమ్మెను విరమింపజేయాలని కోరారు.

జనభాగీదారిపై నేడు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు

ఈనెల 10వ తేదీ బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఇంటర్మీడియట్, ఆపై చదువుతున్న విద్యార్థులకు, 26 సంవత్సరాల వయసు దాటిన యువకులకు వేరువేరుగా వక్తృత్వ పోటీలు నిర్వహించబడునని ఏలూరు నగరపాలక సంస్థ కమీషనర్ ఎస్.వెంకటకృష్ణ తెలిపారు. జనవరి 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని 'సామాజిక న్యాయ మహా శిల్పం' పేరుతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించనున్నారని ఆయన తెలిపారు. ఆ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న పోటీల్లో నెగ్గిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.3 వేలు, రెండో బహుమతిగా వెయ్యి రూపాయలు, వెరసి రూ.8 వేల నగదు, నగరపాలక సంస్థ కార్పొరేషన్ వారిచే ప్రశంసా పత్రం బహుకరించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు, యువకులు ఈక్రింది అంశాలపై మాట్లాడేందుకు సమాయత్తం కావాలని కోరారు. ఆసక్తి గల వారు తమ పేర్లను ప్రాజెక్ట్ ఆఫీసర్ అండ్ మేనేజర్ పి.కృష్ణమూర్తికి ఈనెల 10వ తేది ఉదయం 10 గంటల లోపు అందజేసి నమోదు చేసుకోవాలన్నారు. ఇంటర్మీడియట్, ఆపై విద్యార్థులకు ఆర్థికవేత్తగా అంబేద్కర్, విద్యార్థినులకు సామాజిక ఉద్యమ కారునిగా అంబేద్కర్, యువకులకు అంబేద్కర్, కుల నిర్మూలన, యువతులకు అంబేద్కర్, రాజ్యాంగ నిర్మాణం అంశాలపై పోటీలు ఉంటాయన్నారు. అదేవిధంగా 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించబడతాయన్నారు. విద్యార్థులకు అంబేద్కర్ ఆలోచనలు, విద్యార్థినులకు అంబేద్కర్ రచనలు, ముఖ్యాంశాలపై పోటీలు నిర్వహించబడతాయని తెలిపారు.

భీమడోలు : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బోధనలు, సూచనలు అందరికి ఆచరణీయమని పొలసానిపల్లి గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన తెలిపారు. విజయవాడలో ముఖ్యమంత్రి ప్రతిష్ఠాత్మకంగా ఆవిష్కరించనున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సామాజిక న్యాయ విగ్రహ ఆవిష్కరణ నేపథ్యంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వేదికగా జన భాగీదారి పేర పలు అనుబంధ కార్యక్రమాలను నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎ.దేవి నాగేంద్రప్రసాద్, ఉప సర్పంచి కోటా శ్రీనివాసరావు, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ పాల్గొన్నారు. పొలసానపల్లి గ్రామం నుంచి మండల స్థాయిలో జరిగే క్రికెట్ పోటీలకు ఎంపికైన అనిల్ జట్టుకు సర్పంచి, ఎంపిటిసి సభ్యులు క్రికెట్ కిట్లు, టీ షర్టులు, టోపీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న గ్రామ సర్పంచి షేక్ రహీమా బేగం హసేన

అనంతరం భీమడోలు గ్రామపంచాయతీ, రెవెన్యూ శాఖ పోలీస్ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, ఇతర చట్ట విరుద్ధ కార్యక్రమాలు చేపట్టకుండా అవగాహన సదస్సు నిర్వహించారు.

ఆశీర్వాదం మృతి ఉద్యమాలకు తీరని లోటు

చింతలపూడి : ప్రముఖ దళిత నాయకులు బండి ఆశీర్వాదం మృతి చెందటం వ్యవసాయ కార్మిక ఉద్యమాలకు తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మామిళ్లపల్లి వసంతరావు అన్నారు. చింతలపూడిలో పట్టణంలో ఆశీర్వాదం స్వగృహంలో ఆయన పార్థివ దేహాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో వయసు సహకరించకపోయినా రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు సంఘీభావం తెలిపి ఆ ఉద్యమ అవసరాలకు రూ.2 వేలు విరాళం ఇచ్చి వారి ఉద్యమాన్ని ప్రోత్సహించినటువంటి వ్యక్తి ఆశీర్వాదం అన్నారు. నివాళులర్పించిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బోడ వజ్రం, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, పట్టణ కార్యదర్శి ఎస్‌కె.జాని ఉన్నారు.

సిపిఎం నాయకులు ఆర్‌విఎస్ నారాయణ, అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ సిఐటియు యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షులు సరోజిని, కార్యదర్శి మాణిక్యం బండి ఆశీర్వాదం పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

అట్లూరి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధితులకు సాయం

ముసునూరు : మండలంలోని గుళ్లపూడి హరిజనవాడలో గత రెండు రోజుల క్రితం ఎలమేల్లీ వెంకటేశ్వరరావు, సుబ్బారావు అన్నదమ్ముల రెండు ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయ్యి ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెండు ఇళ్లు కూడా పూర్తిగా దగ్ధం అయ్యాయి. కనీసం ఇంట్లో కట్టుకున్న బట్టలు కూడా మిగలకుండా తగలడిపోవడంతో నిరాశులైన వారికి అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అట్లూరి రవీంద్ర వారి కుటుంబానికి నిత్యావసర వస్తువులు, బట్టలు, 25 కేజీల బియ్యం రెండు కుటుంబాలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు మండలపు బుజ్జి, రాష్ట్ర తెలుగు యువత కార్యనిర్వాహణ కార్యదర్శి గద్దె రఘుబాబు, మండలపు ధర్మరాజు, లక్కపాము కాంతారావు, పల్లి వెంకటేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

ఫైలేరియా నివారణకు రక్తనమూనా సేకరణ

టి.నరసాపురం : సమాజంలో ప్రతిఒక్కరూ ఫైలేరియా నివారణకు సహకరించాలని మండల వైద్యాధికారిణి జె.కల్పనా రాణి తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, జిల్లా మలేరియా అధికారి వారి ఆదేశాల మేరకు టి.నరసాపురం సచివాలయం-2 పరిధిలో మైక్రోఫైలేరియా సర్వేలేన్స్ నైట్ రక్తపూతల సేకరణ మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎ.లలిత కుమారి, మావుళ్లమ్మ పాల్గొన్నారు.

భూహక్కు చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని టిడిపి చింతలపూడి నియోజకవర్గ నాయకులు సోంగా రోషన్ కుమార్ డిమాండ్ చేశారు. చింతలపూడి పట్టణంలో మంగళవారం చింతలపూడి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేయాలని లాయర్లు చేస్తున్న బైక్ ర్యాలీ కార్యక్రమంలో టిడిపి నియోజకవర్గ మాజీ కన్వీనర్ జగ్గవరపు ముత్తారెడ్డితో కలిసి పాల్గొన్నారు. అనంతరం తహశీల్దార్ కృష్ణజ్యోతికి వినతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి మేకా ఈశ్వరయ్య, మండల టిడిపి అధ్యక్షులు మాటూరి వెంకట్రామయ్య, టౌన్ అధ్యక్షులు పక్కాల వెంకటేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షులు చీదరాల మధుబాబు, టిడిపి ప్రధాన కార్యదర్శి కొండ్రు దేవా, తదితర టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



చింతలపూడిలో తహశీల్దార్‌కు వినతిని అందజేస్తున్న న్యాయవాదులు

నూజివీడు రూరల్: నూజివీడు కోర్టు భవనాల వద్ద ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్-2023 రద్దు కోరుతూ న్యాయవాదులు 15వ రోజు మంగళవారం నిరవధిక నిరసన కొనసాగించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు హరిబాబు మాట్లాడుతూ రెవెన్యూ అధికారులతో న్యాయం జరగకపోతే ప్రజలు కోర్టును ఆశ్రయిస్తారని తెలిపారు. యాక్టు రద్దయ్యే వరకు నిరసన దీక్ష చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సత్య ప్రకాష్, డెక్సన్, నరసింహారావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - మండవల్లి

అనారోగ్యంతో ఎవరూ బాధపడకూడదనే లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజలకు వైద్యాన్ని మరింత చేరువ చేశాడని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు పేర్కొన్నారు. మండలంలోని భైరవపట్నంలో రూ.20.80 లక్షల నిధులతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లీనిక్ నూతన భవనాన్ని ఎంఎల్‌సి జయమంగళ వెంకటరమణతో కలిసి మంగళవారం ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని ఏర్పాటు చేసిన కౌంటర్లను పరిశీలించారు. అనంతరం జగనన్న పాదయాత్రకు ఐదు సంవత్సరాల ముగిసిన సందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ్ దుర్గాప్రసాద్, జెడ్‌పిటిసి ముంగర విజయనిర్మల, కైకలూరు ఎఎంసి ఛైర్మన్ వీరాజు, రాష్ట్ర నాయకులు సయపరాజు గుర్రాజు, భాస్కర్ రాజు, సర్పంచి నీలపాల రాధా నాగేంద్ర, ఎంపిటిసి నాగదాస కిరీట్ రాజు, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు బేతపూడి ఏసేబు రాజు పాల్గొన్నారు.

పలుచోట్ల 'జగనన్న సురక్ష-2'

ముసునూరు : వైద్య, విద్యా రంగంలో జగన్మోహన్‌రెడ్డిని మించిన నాయకుడు లేడని నూజివీడు ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం మండలంలోని గోపవరం గ్రామంలో హెల్‌నెస్ సెంటర్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష ఎంపిడిఒ జి.రాణి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి డాక్టర్ ప్రతాప్, ఎంపిపి కొండా దుర్గభవాని వెంకట్రావ్, వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన, వైస్ ఎంపిపి పాముల గంగధరరావు, సొసైటీ అధ్యక్షులు కోటగిరి గోపాలకృష్ణ, సర్పంచి కంచర్ల వాణి, తహశీల్దార్ దాసరి సుధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలు : జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమ సేవలను వినియోగించుకోవాలని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతి దేవి కోరారు. అంబర్‌పేట గ్రామ సచివాలయం కేంద్రంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి దీపికా రాంబాబు, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్రావు పాల్గొన్నారు.

పొలం బడికి రాష్ట్రస్థాయి గుర్తింపు

భీమడోలు : మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మేలైన యాజమాన్య పద్ధతులతో కూడిన పొలంబడి కార్యక్రమం రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. గత సీజన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పురుగు మందు అవశేషాలు లేని నాణ్యమైన ధాన్యం ఉత్పత్తితో పాటు సాధారణ పద్ధతిలో చేపట్టిన వరిసాగు కన్నా ఎక్కువ మొత్తంలో దిగుబడి వచ్చింది. దీంతో రాష్ట్రస్థాయిలో ఉత్తమ పొలంబడిగా గుర్తింపు పొందేందుకు అవసరమైన సర్టిఫికెట్ జారీకి వ్యవసాయ శాఖ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. త్వరలో సర్టిఫికెట్ జారీ అయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు వై.రామకృష్ణ భీమడోలు కేంద్రంగా మేలైన వ్యవసాయ పద్ధతులతో కూడిన పొలంబడి కార్యక్రమం నిర్వహణకు ఎంపిక చేశారు. వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు పి.ఉషా రాజకుమారి పర్యవేక్షణలో వ్యవసాయ అధికారి ఉషారాణి ఆధ్వర్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పొలంబడి కార్యక్రమాల నిర్వహణకు పటిష్టమైన శాస్త్రీయ చర్యలను చేపట్టారు. ఇక ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులు ఎంటియు 11, 21 రకాలను సాగు చేస్తున్నారు. దీంతో పాటు కొద్ది మొత్తంలో పిఆర్ 126, ఇతర రకాలను వాడుతున్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ భీమడోలు సహాయ సంచాలకులు మాట్లాడుతూ ఎంటియు 11, 21 రకం పంటకాలం 136 రోజులుగా ఉంటుందన్నారు. రైతులను ఆదుకునే క్రమంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా తగు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

మెగా డిఎస్‌సి విడుదల చేయాలి
డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నేడు చలో విజయవాడ

ఏలూరు : జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే ప్రతి సంవత్సరం మెగా డిఎస్‌సి విడుదల చేస్తానని హామీ ఇచ్చి నాలుగున్నరేళ్లు పూర్తవుతున్నా ఇప్పటివరకు విడుదల చేయకపోవడం దుర్మార్గమని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ అన్నారు. మంగళవారం ఏలూరు ఆర్ఆర్ పేట ప్రజా సంఘాల కార్యాలయంలో డివైఎఫ్ఐ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సంఘం సభ్యులు దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి సూర్యకిరణ్ మాట్లాడుతూ తక్షణమే ఎన్నికల హామీలో భాగంగా మెగా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలన్నారు. మెగా డిఎస్‌సి విడుదల చేయాలని ఈనెల 10వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం చేపట్టామని, నిరుద్యోగులు, యువత తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజేష్, కనకరాజు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై సివిల్ సప్లయిస్ అధికారుల దాడి
నలుగురిపై కేసు నమోదు

భీమడోలు : భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని రెండు రేషన్ షాపులపై విజిలెన్స్ అండ్ సివిల్ సప్లై అధికారులు సోమవారం రాత్రి దాడులను నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత రేషన్ షాప్‌ల డీలర్లు కేతినేటి దుర్గా పల్లవి, మద్దాల వెంకటరత్నంపై 6(ఎ) కేసులు నమోదు చేసినట్లు భీమడోలు సివిల్ సప్లయిస్ డిటి ఎ.మాధవరావు తెలిపారు. దీనిలో భాగంగా ఒక షాపులో 1100 కేజీలు, మరొక షాపులో 590 కేజీలు బియ్యం తరుగును గుర్తించారన్నారు. దీంతో పాటు 72 కేజీల పంచదార, 33 కేజీల గోధుమపిండి తరుగు ఉన్నట్టు తనిఖీల్లో తేలింది. ఇదే సమయంలో రేషన్ షాప్ నుంచి సరుకును తరలించే ప్రయత్నంలో డీలర్లకు సహకరిస్తున్న రవాణా వాహనాల డ్రైవర్లు జి.విజయ రత్నం, పి.నాగ మహేష్‌లపై 6(ఎ) కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ సిఐ శివశంకర్, ఎఒ కన్యాకుమారి, మార్కండేయులు పాల్గొన్నారు.

ప్రకృతి కషాయాలతో అధిక దిగుబడులు

నూజివీడు రూరల్ : పట్టణంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ మహిళా ప్రతినిధి విజయ కుమారి మాట్లాడుతూ అధికారుల సహకారంతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల నుంచి ఉత్పత్తులను సేకరించి ఒక వేదికగా విక్రయిస్తున్నామని, ప్రకృతి పరంగా కషాయాలను తయారుచేసి అన్ని పంటల సాగుకు సహాయకారిగా అందిస్తున్నామని తెలిపారు.

ఘనంగా వైసిపి సంకల్పయాత్ర

నూజివీడు రూరల్ : జగన్ చేసిన ప్రజాసంకల్పయాత్ర ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని ఎంఎల్ఎ మేక వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. మంగళవారం నూజివీడు వైసిపి కార్యాలయంలో ప్రజా సంకల్పయాత్ర ఐదేళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. 341 రోజుల్లో 2,516 గ్రామాల్లో 3,648 కిలోమీటర్లు జగన్ పాదయాత్ర చేశారని తెలిపారు.

మామిడి తోటల పరిశీలన

చాట్రాయి : మండలంలోని చాట్రాయి, నరసింహారావు పాలెం గ్రామాల్లోని మామిడి తోటలను మంగళవారం ఉద్యాన శాఖ అధికారిని ఎన్.హేమ పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ పూత రాని తోటలకు మోనొకి 10 గ్రాములు లీటర్ నీటిని, బోరాన్ రెండు గ్రాములు లీటర్ నీటికి, జింక్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. పూత కొచ్చిన తోటలకు పచ్చి పూత మీద తేనె మంచు పురుగు ఉంటే ఎస్‌పేట్ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని రైతులకు తెలిపారు. తెగుళ్లు ఆశించే తోటలకు సాఫ్ రెండు గ్రాములు లీటర్ నీటి కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి

నూజివీడు రూరల్ : హాస్టల్లో చదివే పదవ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని బిసి వెల్ఫేర్ సంక్షేమ సాధికార అధికారిని ఆర్.నాగరాణి తెలిపారు. నూజివీడు పట్టణంలోని బిసి వెల్ఫేర్ కార్యాలయాన్ని మంగళవారం ఆమె విస్తృత తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎబిసిడబ్ల్యు రావి రవి, ప్రసాద్, వసతి గృహ సంక్షేమ అధికారులు నజీర్, విజయబాబు పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి : పిడిఎస్‌యు

ఏలూరు అర్బన్ : రాష్ట్రంలో అన్ని రంగాల్లో రెండు లక్షల 30 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు ఇ.భూషణం, పివైఎల్ డివిజన్ సహాయ కార్యదర్శి టి.బాబూరావు అన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్లో ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్‌యు జిల్లా, అధ్యక్ష కార్యదర్శులు కాకి నాని, మహిళ ఉపాధ్యక్షులు బి.వినోద్, కె.క్రాంతి పాల్గొన్నారు.

'కొల్లేరు అభివృద్ధి చింతమనేనితోనే సాధ్యం'

ఏలూరు టౌన్ : కొల్లేటి గ్రామాలు అభివృద్ధి జరగాలన్నా, తమ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడాలన్నా దెందులూరు ఎంఎల్ఎగా చింతమనేని ప్రభాకర్ మళ్లీ అధికారం చేపట్టాలని కొల్లేటి ప్రాంత నాయకులు తెలిపారు. దుగ్గిరాలలోని క్యాంపు కార్యాలయంలో దెందులూరు మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్‌ని ఏలూరు రూరల్ మండలం కోమటిలంక గ్రామానికి చెందిన పలువురు నాయకులు, ప్రజలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా టిడిపి హయాంలో చింతమనేని ప్రభాకర్ తమ కొల్లేటి గ్రామాల అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఎంతగానో సహకరించారని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా కొల్లేటి ప్రాంతాల ప్రజలందరం టిడిపి, జనసేన కూటమికి మద్దతు ఇచ్చి, భారీ మెజారిటీతో చింతమనేనిని గెలిపించుకుంటామని, కొల్లేటి పూర్వవైభవం తీసుకొస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జొన్నగిరి శ్యాంబాబు, ముంగర నాగరాజు, జొన్నగడ్డ బాబు, తెనాలి చిన్ని, సైదు శివన్నారాయణ, జల్లూరి వీర్రాజు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలతో సర్వసభ్య సమావేశం

జీలుగుమిల్లి : ఎంపిడిఒ కార్యాలయంలో మంగళవారం ఎంపిపి కోర్స పోసమ్మ అధ్యక్షతన జరిగిన సర్వ సభ్య సమావేశానికి సర్పంచులు, రెవెన్యూ, పంచాయతీ కార్యదర్శులు, ఎంపిటిసిలు, ప్రధాన శాఖలలో ఉన్న కొంతమంది అధికారులు లేకుండా ఖాళీ కుర్చీలతో సమావేశం నిర్వహించారు. కొన్ని శాఖలకు సంబంధించి ఒక్కో అధికారి చొప్పున రావడంతో సమావేశాన్ని నామ మాత్రంగా నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సమావేశ నిర్వహణ పై ఉన్నతాధికారులు దృష్టి సారించి రాని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఎస్ఐ సురేష్‌కు సత్కారం

భీమడోలు : సమర్థవంతంగా సేవలందించిన ఉద్యోగికి గుర్తింపు ఉంటుందని, ఆ తరహా వ్యక్తులలో భీమడోలు ఎస్ఐగా పనిచేసిన చావా సురేష్ ఒకరని భీమడోలు సిఐ బిబి.రవికుమార్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో భీమడోలు పోలీసు సిబ్బంది మంగళవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భీమడోలు ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన వై.సుధాకర్‌కు స్వాగత కార్యక్రమాన్ని చేపట్టారు. బదిలీపై వెలుతున్న సురేష్ దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇద్దరు పేకాటరాయుళ్లు అరెస్టు

ముదినేపల్లి : పేకాటాడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ డి.వెంకట్ కుమార్ సోమవారం తెలిపారు. మండలంలోని వడాలి గ్రామంలో పేకాడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి దాడి చేసి ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రూ.3,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

మద్యం విక్రేత అరెస్టు

ముదినేపల్లి : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సింగరాయపాలెం సెంటర్‌లో భక్తి నిఖిత అనే రాజస్థానీకి చెందిన వ్యక్తి తన టీ స్టాల్‌లో కొంతకాలంగా అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఉదయం టీ స్టాల్‌లో మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 7 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థి దశలో చదువే లక్ష్యం కావాలి

నూజివీడు రూరల్ : విద్యార్థి దశలో చదువు ఒక్కటే లక్ష్యం కావాలని ప్రొఫెసర్ భక్తుల విజయ్ కుమార్ అన్నారు. నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్‌పి హైస్కూల్ ఆవరణలోని సమావేశ మందిరంలో కెరియర్ గైడెన్స్‌పై మంగళవారం ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం భాగవతుల హేమలత పాల్గొన్నారు.

పాఠశాల కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

నూజివీడు రూరల్ : 2017 నుంచి 2019 వరకు ఉన్న వేతన బకాయిలను చెల్లించాలని, కనీస వేతనాలను అమలు చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి వేముల బక్కయ్య తెలిపారు. నూజివీడు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద మంగళవారం మిడ్ డే మీల్, నైట్ వాచ్‌మెన్, పాఠశాల పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాంజనేయులు, వీరయ్య, శంకరరావు పాల్గొన్నారు.

రేపు మినీ జాబ్ మేళా

ఏలూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో వెలుగు ఆఫీస్, సత్రంపాడులో ఈనెల 11న మినీ జాబ్ ఫెయిర్ నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మినీ జాబ్ ఫెయిర్‌లో హెట్రో లాబ్స్, ఇన్నోవసోర్స్, పేటిఎం కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పిజి వంటి విద్యార్హతలు ఉండి 18-35 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలియజేశారు. ఇతర వివరాలకు 9988853335 టోల్‌ఫ్రీ సంప్రదించాలన్నారు.

ఎస్‌టియు మండల శాఖ ఎన్నిక

ఆగిరిపల్లి : ఎస్‌టియు మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఈదర మెయిన్ పాఠశాల ఉపాధ్యాయుడు మక్కే వేణుగోపాలరావు, అమ్మవారిగూడెం ప్రాథమిక పాఠశాలకు చెందిన కోలంటి వంశీ వశిష్టలు ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఆర్థిక కార్యదర్శిగా అంకం వెంకటేశ్వరరావు, మహిళా కార్యదర్శిగా రజియాబేగం, గౌరవాధ్యక్షులుగా ఆర్.వెంకటేశ్వరరావులను ఎన్నుకొన్నారు. ఎన్నికల అధికారిగా షేక్ అబ్దుల్ హక్ వ్యవహరించారు.

రూ.3.93 కోట్లతో అభివృద్ధిపనులు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరంలోని పలు డివిజన్లలో రూ.3.93 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ ఆళ్ల నాని మంగళవారం శంకుస్థాపన చేశారు. 47వ డివిజన్‌లో సుమారు రూ.94 లక్షల అంచనా వ్యయంతో 17 రోడ్లు, మూడు డ్రెయిన్ల నిర్మాణానికి, 48వ డివిజన్‌లో సుమారు రూ.90 లక్షల అంచనా వ్యయంతో తొమ్మిది రోడ్లు, పది డ్రెయిన్ల నిర్మాణానికి, 49వ డివిజన్‌లో రూ.1.15 కోట్ల అంచనా వ్యయంతో 24 రోడ్లు, నాలుగు డ్రెయిన్లు, 50వ డివిజన్‌లో రూ.94.12 లక్షల అంచనా వ్యయంతో ఆరు రోడ్లు, ఒక డ్రెయినేజీ, మరో సామాజిక భవన నిర్మాణానికి ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు.